సాక్షి
సిద్దిపేట
మంగళవారం। 22। ఏప్రిల్। 2025

ముంచెత్తిన వాన..

హుస్నాబాద్: మార్కెట్ యార్డులో నీటిలో మునిగిన ధాన్యం రాశులు



వరదనీటిలో ధాన్యం.. రైతన్న శోకం

- అకాల వర్షంతో తీరని నష్టం
- నోటికాడికూడు వర్షార్పణం

జిల్లాలో అకాల వర్షం తీరని నష్టాన్ని కలిగించింది. సోమవారం సాయంత్రం పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. పలు కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం బస్తాలు తడిసిముద్దయ్యాయి. హుస్నాబాద్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆరబెట్టిన ధాన్యం పూర్తిగా తడిసి పోయింది. కాంటా కోసం ధాన్యం ఆరబెట్టి, తాలు లేకుండా శుభ్రం చేసుకున్నారు. ఒక్కసారిగా కురిసిన వర్షంతో ధాన్యమంతా నీటిపాలైంది. మార్కెట్‌లోకి వరద వస్తే బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వరద ఎక్కడికక్కడా నిలిచిపోవడంతో ధాన్యమంతా నీటిలో మునిగిపోయింది. మునిగిన ధాన్యాన్ని గంపల్లో ఎత్తుకుంటూ రైతులు అవస్థలు పడ్డారు. కాంటా పెట్టిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించకపోవడంతో ధాన్యం బస్తాలు సైతం తడిసిపోయాయి. పది రోజుల నుంచి పడిగాపులు కాసి ధాన్యానికి కాపలాగా ఉంటే ఒక్కసారిగా కురిసిన వర్షంతో ధాన్యమంతా నీటి పాలైందని రైతులు కన్నీటిపర్యంతమయ్యారు. అలాగే జగదేవ్‌పూర్ మండలంలో ఈదురు గాలులు, వడగళ్లతో వర్షం కురిసింది. చెట్లు నేలకొరిగాయి. హోల్‌సెల్ చెప్పుల దుకాణం పైకప్పు రేకులు ఎగిరిపడ్డాయి. అలాగే నిరుపేదకు చెందిన పూరి గుడిసె ధ్వంసమైంది. పలు గ్రామాల్లో వరి పంటకు నష్టం జరిగింది. మామిడి తోటల్లో మామిడి కాయలు నేలరాలాయి. మద్దూరు మండల కేంద్రంతో పాటు జాలపల్లి, తోర్నాల, లింగాపూర్ గ్రామాల్లో ఉరుములు, మెరుపులులతో వర్షం కురిసింది. గాలి దుమారానికి పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకూలాగా, పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి.

–హుస్నాబాద్/మద్దూరు/జగదేవ్‌పూర్(గజ్వేల్)



హుస్నాబాద్: వరద నీటిలో ధాన్యం రాశులు



మద్దూరు: ధ్వంసమైన ఇల్లు



హుస్నాబాద్: వరద నీటిలో కొట్టుకుపోతున్న ధాన్యం



జగదేవ్‌పూర్‌లో కూలిన దుకాణం పైకప్పు



జగదేవ్‌పూర్‌లో గాలివానకు ధ్వంసమైన గుడిసె

న్యూస్‌రీల్

అభివృద్ధి, సంక్షేమానికే ప్రాధాన్యం

గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి



సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ తదితరులు

గజ్వేల్: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తున్నదని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డులో రూ.10లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కోరగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.5కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఈ నిధులను ప్రాధాన్యత క్రమంలో కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఇంకా ఈ ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, నాయకులు మొనగారి రాజులు, నక్క రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడతాం

సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి



సమ్మె కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

మిరుదొడ్డి(దుబ్బాక): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడతామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాల స్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28న హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని తెలిపారు. ధర్నా కార్యక్రమానికి హమాలీ కార్మికులు తరలిరావాలని కోరారు. అలాగే మే 20న దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సమ్మె కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శ్రీనివాస్, ఎల్లం, స్వామి, నాగేందర్, బాల పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఆవిష్కరణలు అవసరం


కృషికల్ప సీఈఓ సీఎం పాటిల్

సిద్దిపేట ఎడ్యుకేషన్: ఆవిష్కరణలు కొత్తవి సృష్టించడమే కాకుండా మనం ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారాలు ఆలోచించాలని కృషి కల్ప సీఈఓ సీఎం పాటిల్ అన్నారు. ప్రపంచ ఇన్నోవేషన దినోత్సవం సందర్భంగా సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో సోమవారం ఇన్నోవేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీజీఐసీ ఆతిథ్య సంస్థగా పని చేస్తున్న స్వయంప్రతిపత్తి కళాశాలలో ఇన్నోవేటర్లను గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సునిత, వైస్ ప్రిన్సిపల్, ఇన్నోవేషన్ కోఆర్డినేటర్ అయోధ్యరెడ్డి, గురుచరణ్ దాస్, ఎంఎస్‌సీ, ఫిషరీస్, బోటనీ, జువాలజీ, బీబీఏ విభాగాల విద్యార్థులు పాల్గొన్నారు.

కార్డుల్లో పేర్లు గజిబిజి



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి నంగునూరు మండలం పాలమాకుల గ్రామానికి చెందిన గాండ్ల రాజు. ప్రజాపాలన, సమగ్ర కుటుంబ సర్వేలో కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేశారు. తీరా.. రాజు సతీమణి హేమ పేరుతోపాటు కుమారులు గాండ్ల విశాల్, విహాన్ పేర్లు సైతం అత్తంటి వారి కార్డులోనే ఉన్నాయి. అధికారులను అడిగితే మాకు తెలియదని సమాధానం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మా కుటుంబానికి కొత్త రేషన్ కార్డు మంజూరు చేయాలని కోరుతున్నారు. ఇలా వీరి ఒక్కరిదే కాదు.. కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసిన వారిలో పలువురి పరిస్థితి ఇలాగే ఉంది.



అత్తంటి రేషన్ కార్డులో నమోదైన పేర్లు



సాక్షి, సిద్దిపేట: కొత్త రేషన్ కార్డులు మంజూరు కాలేదు.. దరఖాస్తు చేసిన వారి పేర్లు అమ్మమ్మ, నానమ్మ రేషన్ కార్డుల్లో పేర్లు నమోదు అయ్యాయి. దీంతో దరఖాస్తు దారులు ఆందోళన చెందుతున్నారు. తొమ్మిదేళ్ల తర్వాత కొత్త రేషన్ కార్డుల జారీ, పేర్ల నమోదుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో ప్రజలు సంతోషించారు. కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజాపాలన, సమగ్ర కుటుంబ సర్వేలలో జిల్లా వ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల కోసం, చేర్పులు కోసం 74,272 మంది దరఖాస్తు చేశారు.

గందరగోళంగా రేషన్ కార్డుల జారీ ప్రక్రియ

- అమ్మమ్మ, నానమ్మ కార్డుల్లోనే మనవళ్లు, మనవరాళ్ల పేర్లు
- కొత్త కార్డుల కోసం 43 వేల మంది దరఖాస్తు
- పేర్లు సరి చేయాలని కోరుతున్న దరఖాస్తు దారులు

52వేల మంది దరఖాస్తు

ప్రజాపాలన, సమగ్ర కుటుంబ సర్వేలో కొత్త రేషన్ కార్డుల కోసం 52,742, పేర్లు చేర్పుటకు 21,530 మంది దరఖాస్తు చేశారు. వీటి ఆధారంగా ప్రాథమిక స్థాయిలో అర్హులను గుర్తించి వారి జాబితాలను గ్రామ పంచాయతీ, పట్టణాల్లో వార్డు సభలలో ప్రకటించారు. ఈ జాబితాలో పేర్లు ఉన్న వారు మీసేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవద్దని అధికారులు చెప్పడంతో నూతన కార్డులు వచ్చినట్లే అని సంతోషపడ్డారు. వీరికి ఉగాది నుంచి సన్న బియ్యం పంపిణీ చేస్తామని ప్రకటించారు. దీంతో ఆనందంతో రేషన్ షాప్‌లకు వెళ్తే కొత్త కార్డు రాలేదు.. పిల్లల పేర్లు అమ్మమ్మ, నానమ్మ కార్డులలో నమోదు కావడంతో అయోమయానికి గురవుతున్నారు.

విచిత్ర పరిస్థితి

పెళ్లయిన మహిళలు భర్తతో నూతన రేషన్ కార్డు కావాలని తమ చిన్నారులతో సహా దరఖాస్తు చేశారు. అలాగే కొత్త కార్డుల కోసం పెళ్లయిన యువకులు సైతం తమ పేర్లను తల్లిదండ్రుల కార్డుల నుంచి తొలగించుకుని దరఖాస్తు చేసుకున్నారు. అయితే వీరి పేర్లు అత్తగారి రేషన్ కార్డులో తమ చిన్నారులతో సహా నమోదయ్యాయి. ఇలా కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని గందరగోళానికి గురి చేస్తున్నాయి. ఆన్‌లైన్‌లో సిబ్బంది చేసిన తప్పా? లేక టెక్నికల్ సమస్యతో ఇలా నమోదు అయ్యాయా? అని ఆందోళన చెందుతున్నారు. మళ్లీ దరఖాస్తు చేసేందుకు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తప్పులను సరి చేసి కొత్త రేషన్ కార్డులను జారీ చేయాలని కోరుతున్నారు.

అమ్మ వాళ్ల కార్డులోనే..



ప్రజాపాలన, సమగ్ర కుటుంబ సర్వేలో కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేశాం. మా అమ్మ నాన్న వాళ్ల కార్డులో నుంచి నా పేరు తొలగించి కొత్త రేషన్ కార్డు జారీ చేయాలని కోరాను. కానీ నా కుమారుడు, భార్య పేర్లు సైతం మా అమ్మ వాళ్ల రేషన్ కార్డులోనే నమోదు చేశారు. అధికారులు స్పందించి నా ఫ్యామిలీకి కొత్త రేషన్ కార్డు మంజూరు చేయాలి. - సుంకె సంపత్, హుస్నాబాద్

టెక్నికల్ సమస్య..



టెక్నికల్ సమస్యతో కొందరి పేర్లు నమోదు అయినట్లు తెలుస్తోంది. వచ్చే నెల వరకు పేర్లను సరి చేస్తాం. కొత్త రేషన్ కార్డులకు సంబంధించి క్షేత్రస్థాయిలో సర్వే కొనసాగుతోంది.

- తనూజ, డీఎస్‌ఓ

అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లు

- పైరవీలకు తావులేదు
- రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎండీ గౌతమ్



మేదినీపూర్‌లో ఇల్లు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న హౌసింగ్ ఎండీ గౌతమ్

కొండపాక(గజ్వేల్): ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ఎలాంటి పైరవీలకు తావులేదని, అర్హులకే మంజూరు చేస్తామని రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఎండీ వీపీ గౌతమ్ అన్నారు. కుకునూరుపల్లి మండలం మేదినీపూర్‌లో పైలెట్ ప్రాజెక్టులో భాగంగా కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను సోమవారం పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాల్లో ప్రభుత్వం చూపిన కొలతల కంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మించుకునే ఇళ్లకు సైతం పథకం వర్తించేలా చూడాలని గ్రామస్తులు ప్రత్యేకాధికారి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా గౌతమ్ మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారుల ఖాతాల్లో మొదటి విడత డబ్బులు వేసే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. గ్రామంలో 75 ఇళ్లు మంజూరు కాగా 11 మాత్రమే ప్రారంభమయ్యాయన్నారు. ఇళ్ల మంజూరు కోసం దళారులను ఆశ్రయించి మోసపోవద్దన్నారు. పేదలు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, ఎంపీడీఓలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగిరం చేయాలి



మాట్లాడుతున్న హౌసింగ్ ఎండీ వీపీ గౌతమ్

సిద్దిపేటరూరల్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగిరం చేయాలని రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఎండీ వీపీ గౌతమ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల ప్రగతిపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలన్నారు. స్థలం ఉండి పూర్తిగా ఇల్లు కట్టుకునే స్తోమత లేని నిరుపేదలను మాత్రమే గుర్తించాలని అన్నారు. ఆర్థిక సహకారం కోరుకునే వారికి మహిళా సమాఖ్యల ద్వారా రుణం ఇప్పించేలా అధికారులు చొరవ చూపించాలన్నారు. ప్రాధాన్యత క్రమంలో పూర్తయ్యే ఇంటి నిర్మాణ పనులను పంచాయతీ సెక్రటరీ పోర్టల్‌లో నమోదు చేయాల్సిన అవసరం లేదన్నారు. లబ్ధిదారుడే తన స్మార్ట్ ఫోన్‌లో ఇంటి నిర్మాణ ఫొటోలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేసుకునే అవకాశాన్ని కల్పించినట్లు తెలిపారు. వాటి ఆధారంగా బిల్లుల్లో ఆలస్యం జరగదన్నారు. అసంపూర్తిగా, చివరిస్థాయిలో ఉన్న డబుల్ బెడ్రూం నిర్మాణ పనులపై మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన మేరకే నిర్మాణ పనులు పూర్తి చేసేలా చూడాలన్నారు. అనంతరం కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపికలో ఒక్క అనర్హుడు ఉండకుండా జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, హౌసింగ్ పీడీ దామోదర్ రావు, డీఆర్డీఓ జయదేవ్ ఆర్య, గజ్వేల్, హుస్నాబాద్ ఆర్డీఓలు చంద్రకళ, రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఈఈ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

లబ్ధిదారులతో సమావేశం

మండల పరిధిలోని వెంకటాపూర్‌ను గౌతమ్ సందర్శించారు. లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 183 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి మంజూరు పత్రాలు అందించామన్నారు. వారిలో 21 మంది మార్కింగ్ చేసుకోవడంతో పాటు 11 మంది బేస్మెంట్ పూర్తి చేసుకున్నారన్నారు. నిర్మాణానికి సంబంధించి సామగ్రి ధరలు పెరిగాయని లబ్ధిదారులు చెప్పడంతో ఇసుకను ఉచితంగా అందించడంతో పాటుగా ధరల నియంత్రణపై చర్చలు జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

సమస్యల పరిష్కారానికే భూ భారతి

కలెక్టర్ మనుచౌదరి

మిరుదొడ్డి(దుబ్బాక): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన భూ భారతి చట్టం భూ సమస్యల పరిష్కారానికి దోహద పడుతుందని కలెక్టర్ మనుచౌదరి చెప్పారు. స్థానిక రైతు వేదిక భవన్‌లో భూ భారతి చట్టంపై సోమవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ధరణిలో తలెత్తిన సమస్యలకు భూ భారతితో పరిష్కారం లభిస్తుందన్నారు. అలాగే భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం రైతులకు భూ ఆధార్‌కార్డులను మంజూరు చేస్తారని చెప్పారు. ఎవరైనా మోసపూరితంగా రికార్డులను మార్చినా అలాంటి రద్దుచేసే అధికారం ఈ చట్టానికి ఉంటుందని తెలిపారు. అనంతరం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ భూ భారతిలోని ఆర్‌ఓఆర్ చట్టంతో రైతుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. అధికారులు భూ భారతి చట్టాని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, సిద్దిపేట ఆర్‌డీఓ సదానందం, తహసీల్దార్ ఉదయశ్రీ, ఎంపీడీఓ గణేశ్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు సత్వరం పరిష్కారం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేటరూరల్: ప్రజాసమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి దోహదపడుతుందని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వారితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలు అందిస్తున్న బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. అర్జీలు పునరావతం కాకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. మొత్తం 44 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో డీఆర్‌ఓ నాగరాజమ్మ, డీఆర్డీఓ జయదేవ్ ఆర్య, ఏఓ అబ్దుల్ రహమాన్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వీడిన పీఠముడి..

- వంటిమామిడి ఏఎంసీ చైర్‌పర్సన్‌గా విజయ
- వైస్ చైర్మన్‌గా కొడిత్యాల ప్రభాకర్
- బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన ఏఎంసీ చైర్‌పర్సన్ బాగనోళ్ల విజయ, వైస్‌చైర్మన్ కొడిత్యాల ప్రభాకర్, చిత్రంలో గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, నాయకులు తదితరులు

ములుగు(గజ్వేల్): ఎట్టకేలకు పీఠముడి తొలగింది. వంటిమామిడి ఏఎంసీ (వ్యవసాయ మార్కెట్ కమిటీ) చైర్‌పర్సన్‌గా బాగనోళ్ల విజయ, వైస్ చైర్మన్‌గా కొడిత్యాల ప్రభాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మార్కెట్ కమిటీ కార్యదర్శి రేవంత్ సమక్షంలో వారు పదవీ బాధ్యతలు స్వీకరించారు. కాంగ్రెస్‌లో గ్రూపుల హోరుతో వంటిమామిడి చైర్మన్‌గిరిపై ఉత్కంఠ కొనసాగింది. ఇరు గ్రూపులు వేర్వేరుగా పీఠం కోసం పట్టుపట్టడంతో వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు ఉత్కంఠతకు తెరదించుతూ వంటిమామిడి ఏఎంసీ పాలకవర్గాన్ని ప్రభుత్వం ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. కాగా డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి సొంత గ్రామం వర్గల్‌కు చెందిన మాజీ ఎంపీపీ బాగనోల్ల మోహన్ సతీమణి విజయ పేరును ఆయన సిఫార్సు చేశారు. అందుకు అనుగుణంగానే ఏఎంసీ చైర్‌పర్సన్‌గా ఆమెను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. గతం అవలోకిస్తే కాంగ్రెస్ హయాంలో 2012లో వంటిమామిడి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవిర్భవించింది. తొలి చైర్మన్‌గా 2013 జనవరి 5న ములుగుకు చెందిన సయ్యద్ సలీమ్ (బీసీ) నియమితులయ్యారు. ఆ తరువాత ప్రభుత్వం మారడంతో 2016 ఏప్రిల్ 22న మాజీ సీఎం కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడు, బాల్య మిత్రుడు ములుగుకు చెందిన మహమ్మద్ జహంగీర్ నియమితులయ్యారు. ఆయన 2023 డిసెంబర్ 7 వరకు సుదీర్ఘకాలం పాటు కొనసాగారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం.. ఏఎంసీ పీఠం ఎస్సీ మహిళకు రిజర్వ్ కావడంతో ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఎట్టకేలకు మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డికి అత్యంత సన్నిహితుడైన బాగనోల్ల మోహన్ సతీమణి విజయ నియమితులయ్యా రు. సోమవారం ప్రమాణస్వీకార కార్యక్రమంలో గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నిమ్మ రంగారెడ్డి, మోహన్, రవీందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, అట్ల భాస్కర్ రెడ్డి, నర్సారెడ్డి, అయిలయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ నూతన కార్యవర్గం

వంటిమామిడి ఏఎంసీ చైర్‌పర్సన్‌గా బాగనోల్ల విజయ, వైస్‌చైర్మన్‌గా కొడిత్యాల ప్రభాకర్(బైలంపూర్), సభ్యులుగా కుత్తాడి శ్రీనివాస్ (ములుగు), ఆదాసు మహేందర్(క్షీరసాగర్), ఎనుగు నర్సింహరెడ్డి(నర్సాపూర్), సలేంద్రి మల్లేష్(కొట్యాల), కొమ్మిడి నర్సారెడ్డి(వర్గల్), భుక్యా శ్రీనివాస్ (దాసర్లపల్లి తండా), గుండా శంకర్‌రావు(మర్కూక్), ర్యాకం యాదగిరి (చేబర్తి), పత్తి నర్సింలు(దామరకుంట), పులబోయిన భిక్షపతి (తున్కిబొల్లారం), సయ్యద్ వాజిద్ (ములుగు), కుంట శశికాంత్‌రెడ్డి(అన్నసాగర్) నియమితులయ్యారు.

క్లుప్తంగా

ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డులో సిద్దిపేట చిన్నోడు


విహాన్ రామ్

మద్దూరు(హుస్నాబాద్): ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డులో సిద్దిపేట జిల్లా దూల్మిట్ట మండలం హనుమతండాకు చెందిన అంతర్జాతీయ పర్వతారోహకుడు జాటోత్ విహాన్‌రామ్‌కు చోటు దక్కింది. ఈ విషయం తండ్రి తిరుపతినాయక్ తెలిపారు. ఆదివారం పంజాబ్ రాష్ట్రంలోని అమృత్‌సర్‌లో ఈ మేరకు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డును జాటోత్ విహాన్‌రామ్ అందుకున్నట్లు తిరుపతి తెలిపారు. ఆఫ్రికా ఖండంలోని అత్యంత ఎత్తైన కిలిమంజారో పర్వతాన్ని, హిమాచల్ ప్రదేశ్‌లోని పాతాల్ పర్వతాన్ని అధిరోహించినందుకు గాను అందించినట్లు తెలిపారు. తన కుమారుడిని ఈ స్థాయికి తీసుకొచ్చిన కోచ్ లెంకల మహిపాల్‌కు అంకితం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. విహాన్ మంచిర్యాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు.

వారెవ్వా .. వైష్ణవి

- అంతర్జాతీయ బుక్ ఆఫ్ అవార్డ్సులో దామరకుంట విద్యార్థిని


అవార్డును అందుకుంటున్న వైష్ణవి

మర్కూక్(గజ్వేల్): అంతర్జాతీయ బుక్ ఆఫ్ అవార్డ్స్ వారు నిర్వహించిన పోటీల్లో మర్కూక్ మండలం దామరకుంట విద్యార్థిని లింగ వైష్ణవి ఉత్తమ ప్రతిభ కనబర్చింది. దామరకుంట జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వైష్ణవి ఆదివారం పంజాబ్‌లో నిర్వహించిన పోటీల్లో వైష్ణవి పాల్గొని భౌతిక రసాయన శాస్త్రంలో అత్యంత వేగంగా నిమిషం 59 సెంకడ్లలో ఆవర్తన పట్టిక క్రమ రూపం ఏర్పాటు చేసి బుక్ ఆఫ్ అవార్డ్సులో స్థానం దక్కించుకుంది. సోమవారం ఇంటర్ నేషనల్ బుక్ ఆఫ్ అవార్డ్స్ సీఈఓ పంకజ్ వేగ్ చేతుల మీదుగా ట్రోఫీ, బహుమతిని అందుకుందని మండల విద్యాధికారి వెంకట్ రాములు తెలిపారు. వెంకట్‌రాములు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

సనాతన ధర్మాన్ని కాపాడాలి


ప్రవచనాలందిస్తున్న విద్యారణ్య భారతి స్వామి

పెద్దశంకరంపేట(మెదక్): సనాతన ధర్మాన్ని కాపాడడం అందరి బాధ్యత అని హంపి పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతిస్వామి, చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకులు డాక్టర్ సీఎస్. రంగరాజన్ అన్నారు. సోమవారం పెద్దశంకరంపేటలో నూతనంగా నిర్మించిన రామాలయ ఉత్సవాల్లో వారు పాల్గొని భక్తులకు ప్రవచనాలందించారు. ఆలయ నిర్మాణంలో ప్రతీ ఇంటి నుంచి కులమతాలకు అతీతంగా భాగస్వాములు కావడం అభినందనీయమని కొనియాడారు. ఇలాగే అందరూ కలిసిమెలిసి ఉండి ధర్మ పరిరక్షణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని మహిళ మృతి

జహీరాబాద్: రైలు కింద పడి గుర్తు తెలియని మహిళ మృతి చెందిన ఘటన జహీరాబాద్ పట్టణ శివారులో చోటు చేసుకుంది. వికారాబాద్ పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలో ఆదివారం రాత్రి రైలు కింద పడి గుర్తు తెలియని మహిళ (45) మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని వికారాబాద్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు వివరించారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే సెల్ 84669 38351ను సంప్రదించాలని సూచించారు.

కులం పేరుతో దూషణ


- ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

మద్దూరు(హుస్నాబాద్) : కులం పేరుతో దూషించి వ్యక్తిపై దాడి చేసిన వారిపై సోమవారం ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ షేక్ మహబూబ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని ఖాతా గ్రామానికి చెందిన సోలిపురం బాబు శనివారం మిత్రులు సురేశ్, రాజుతో కలిసి ధూల్మిట్టలో వ్యవసాయ పనులకు కూలీ పనికి వెళ్లారు. తిరిగి వస్తూ బాబు, సురేశ్ వైన్స్ వద్ద గల పర్మిట్ రూంలో మద్యం తాగుతుండగా మహిపాల్‌రెడ్డి కులం పేరుతో బాబును దూషించాడు. కర్రతో దాడి చేయగా తలకు గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు పోలీసులు కేసు నమోదు చేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జైలు

గజ్వేల్‌రూరల్: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఓ వ్యక్తికి 3 రోజుల జైలు శిక్ష పడినట్లు గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళీ పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు.. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన చౌరస్తాల వద్ద ఇటీవల నిర్వహించిన వాహన తనిఖీల్లో 21 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సోమవారం గజ్వేల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక ఎదుట హాజరుపర్చగా విచారణ అనంతరం 21మందికి రూ. 15 వేల జరిమానా విధించగా, ఇందులో ఓ వ్యక్తికి 3 రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

కమ్మేస్తున్న కాలుష్యం


బొల్లారం పారిశ్రామికవాడలో నుండి వెలువడుతున్న వాయు కాలుష్యం

- ప్రమాదకరంగా బొల్లారం పారిశ్రామిక వాడ
- విచ్చలవిడిగా వాతావరణంలోకి విష వాయువులు
- ఘాటైన వాసనలతో జనాల్లో అనారోగ్య సమస్యలు
- పట్టించుకోని పీసీబీ యంత్రాంగం

జిన్నారం (పటాన్‌చెరు): వాయు కాలుష్యం దినదినం ప్రాణాంతకరంగా మారుతోంది. బొల్లారం పారిశ్రామిక వాడలోని పలు రసాయన పరిశ్రమలు విచ్చలవిడిగా విష వాయువులను వాతావరణంలోకి విడుదల చేస్తూ సామాన్య ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఇప్పటికే జల కాలుష్యం పెద్ద ఎత్తున ఉండగా దానికి తోడు వాయు కాలుష్యాన్ని విడుదల చేస్తున్నారు. స్వచ్ఛమైన ఆక్సిజన్ పీల్చుకునే అవకాశాలను సైతం విష వాయువులను విడుదల చేస్తూ హరించేస్తున్నారు. సామాన్య ప్రజల జీవన విధానం పైనే కాకుండా పర్యావరణ పరిరక్షణకు సైతం రసాయన పరిశ్రమలు విఘాతం కలిగిస్తున్నాయి.

రసాయన విష వాయువులు గాలిలోకి..

పారిశ్రామిక వాడకు చెందిన పలు పరిశ్రమలు గుట్టుచప్పుడు కాకుండా ఉదయం సాయంత్రం వేళల్లో పరిశ్రమల పొగ గొట్టాల ద్వారా పెద్ద ఎత్తున రసాయన విష వాయువులను వాతావరణంలోకి విడుదల చేస్తున్నారు. ఈ వాయువులు స్వచ్ఛమైన ఆక్సిజన్ ను కలుషితం చేస్తూ సామాన్య ప్రజలను ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందికి గురి చేస్తున్నాయి. వీటిపై ఫిర్యాదులు చేసిన పీసీబీ యంత్రాంగం క్షేత్రస్థాయిలో పర్యటించి చర్యలు తీసుకోవడంలో ఘోరంగా విఫలమవుతున్నారు. ఫిర్యాదులను పెడచెవిన పెట్టి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

కాలుష్యం నుంచి కాపాడండి



పరిశ్రమల నుంచి నిరంతరం వెలువడుతున్న వాయు కాలుష్యంతో జీవన పరిస్థితులు ఇబ్బందికరంగా ఉంటున్నాయి. శ్వాస తీసుకోవడంలో ఆందోళన పడుతున్నాం. పిల్లలు మహిళలు ఘాటైన వాసనలతో అనారోగ్యం పాలవుతున్నారు. ఫిర్యాదులు చేసిన పట్టించుకునే నాథుడే లేడు. మా ప్రాణాలను రక్షించండి.

– ఇమ్రాన్, బొల్లారం కాంగ్రెస్ నాయకులు

పీసీబీ అధికారుల చర్యలు శూన్యం



స్థానికంగా వెలువడుతున్న విష వాయువులు సామాన్యులను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయని పలుమార్లు పీసీబీ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేరు. సమస్య తీవ్రతరంగా మారుతున్న నిర్లక్ష్యంగా ఉంటున్నారు. అనారోగ్య సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– మద్దూరి పెంటేశ్, బీఆర్ఎస్ నాయకులు

పిల్లలు, వృద్ధుల్లో అనారోగ్య సమస్యలు

విషవాయువులు సామాన్య ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ముఖ్యంగా పిల్లలు వృద్ధుల్లో శ్వాసకోశ సమస్యలతో పాటు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఇక విషవాయువులు కళ్లలో మంటలు పుట్టిస్తూ, ముక్కుపుట్టలు అదిరేలా చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. పరిశ్రమలను గుర్తించి విషవాయువులను నియంత్రించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని పారిశ్రామిక వాడ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వక్ఫ్ సవరణ చట్టంపై అపోహలు నమ్మొద్దు

ఎంపీ రఘునందన్ రావు


మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్ రావు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: వక్ఫ్ సవరణ చట్టంపై పేద ముస్లింలలో అపోహలు సృష్టిస్తూ అల్లర్లు రేపే ప్రయత్నాలు జరుగుతున్నాయని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ప్రతిపక్షాలపై మండిపడ్డారు. సోమవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో పార్టీ మాజీ ఎంపీ బీబీ పాటిల్, జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ.. జహీరాబాద్ నియోజకవర్గంలో మొత్తం 12,892 ఎకరాలు వక్ఫ్ భూములుగా నమోదు చేయడం వల్ల వేల మంది రైతులు హక్కులు కోల్పోయారని వాపోయారు. కొండాపూర్ మండలం సైదాపూర్‌లో 197 ఎకరాలు వక్ఫ్ జాబితాలో చేరడం వల్ల సుమారు 200 మంది రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే కాకుండా మొగుడంపల్లి, కోహీర్, ఝరాసంగం, న్యాల్కల్, రాయికోడ్ మండలాల్లో పెద్ద ఎత్తున భూములు వక్ఫ్ జాబితాలో చేరాయని ఆరోపించారు. రాష్ట్రంలో పాతబస్తీ వక్ఫ్ ఆస్తులపై సీఎం రేవంత్ రెడ్డి బహిరంగంగా వివరాలు ఇవ్వాలనీ, ముతావలీలు ఎవరి పేర్లపై లీజులకు ఇచ్చారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. 'పట్టణాల్లో వక్ఫ్ భూములు ఆక్రమణకు గురవుతున్నా, అసలు లబ్ధిదారులైన పేద ముస్లింలకు ఉపయోగం లేకుండా పోతోందని, తప్పుడు ప్రచారాలు నమ్మొద్దని తెలిపారు. రైతులు, ప్రజలు చట్టంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజేశ్వర్ రావు దేశ్ పాండేతో పాటు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ హెల్త్ రవీందర్ నాయక్
- కొల్చారం పీహెచ్‌సీ తనిఖీ


రోగులతో మాట్లాడుతున్న రవీందర్ నాయక్

కొల్చారం(నర్సాపూర్):ప్రభుత్వాస్పత్రులకు వైద్యం కోసం వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవ లు అందించాలని రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ హెల్త్ రవీందర్ నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆస్పత్రిలోని ఇన్ పేషెంట్ వార్డులో రోగులకు అందుతున్న సేవలపై సిబ్బందితో ఆరా తీశారు. వైద్యం కోసం వచ్చిన రోగులను పలకరించి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రికార్డును పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైద్య సేవలపై నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిపై కఠిన చర్యలు ఉంటాయని, ఎట్టి పరిస్థితుల్లో రోగులకు అసౌకర్యం కలిగించొద్దని సిబ్బందిని ఆదేశించారు. అక్కడి నుంచి అంశాన్ పల్లిలో కొనసాగుతున్న ఆయుష్మాన్ భారత్ సెంటర్‌ను సందర్శించారు. ఆయన వెంట జిల్లా వైద్యాధికారి శ్రీరామ్, నర్సాపూర్ డివిజన్ వైద్యాధికారి సజన, ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రమేశ్, ఎంపీహెచ్ఓ మదన్ మోహన్, సిబ్బంది ఉన్నారు.

సామరస్యంగా సమస్యను పరిష్కరించుకోవాలి

- ఎస్సీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్య
- కొల్చారంలో విగ్రహ ఏర్పాట్ల స్థల పరిశీలన


పోలీసులతో చర్చిస్తున్న వెంకటయ్య

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రం కొల్చారంలో డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు, అనంతరం గ్రామంలో నెలకొన్న సమస్యను ప్రజలు, యువత సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఎస్సీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. సోమవారం గ్రామంలో వివాదాస్పదంగా మారిన అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు, శివాజీ విగ్రహ ఏర్పాటుకు సంబంధించి స్థలంను వెంకటయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. అంబేడ్కర్‌ను, శివాజీ మహారాజ్‌ను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మొదట పెట్టిన అంబేడ్కర్ విగ్రహాన్ని తీసివేయాలనడం సబబు కాదన్నారు. ముందస్తుగానే గ్రామస్తులు ఈ విషయమై చర్చించుకోవాల్సి ఉండేదన్నారు. విగ్రహం ఎదుట మరో విగ్రహం ఏర్పాటు చేయడం ఇబ్బంది కలిగించడమేనని పేర్కొన్నారు. ఎస్పీ, కలెక్టర్ ఈ విషయంలో గ్రామస్తులతో చర్చించి సమస్యను పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐ మహమ్మద్ గౌస్,దళిత సంఘాల నాయకులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో పంట దగ్ధం


కంకులు చూపుతున్న రైతు

కంగ్టి(నారాయణఖేడ్): విద్యుదాఘాతంతో మొక్కజొన్న కంకులు బుగ్గిపాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. కంగ్టి మండలం తడ్కల్ గ్రామానికి చెందిన మహ్మద్ సయ్యద్ అనే రైతు పట్టా భూమిలో ఒక ఎకరం మొక్కజొన్న పంట కాలిపోయింది. విద్యుత్ తీగలతో మంటలు చెలరేగి ఉంటాయని రైతు అనుమానం వ్యక్తం చేశారు. మంటలార్పే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు రూ.80 వేల విలువ చేసే పంట కాలిపోయినట్లు పేర్కొన్నారు. అధికారులు స్పందించి తమకు ఆర్థికంగా ఆదుకోవాలని రైతు కుటుంబీకులు కోరారు.

పిడుగుపాటుకు ఇల్లు ధ్వంసం

ములుగు(గజ్వేల్): పిడుగుపాటుకు ఇల్లు ధ్వంసమై మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన ములుగు మండలం బస్వాపూర్‌లో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితులు, గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామంలో సాయంత్రం 4 గంటల సమయంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. కురుమ వసంత రామాంజనేయులు దంపతులు నివాసముంటున్న ఇంటిపై ఉరుములు, మెరుపులతో కూడిన పిడుగు పడటంతో రేకులు ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదంలో వసంతకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.


ధ్వంసమైన ఇంటి పైకప్పు

లింగయ్యను స్వదేశానికి రప్పించేందుకు కృషి


లింగయ్య భార్యతో మాట్లాడుతున్న సంపత్ కుమార్

హుస్నాబాద్: దుబాయిలో చిక్కుకుపోయిన చొప్పరి లింగయ్యను తిరిగి స్వదేశానికి రప్పించేందుకు కృషి చేస్తామని గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక రాష్ట్ర అధికార ప్రతినిధి గాజుల సంపత్ కుమార్ తెలిపారు. హుస్నాబాద్ పట్టణంలో సోమవారం లింగయ్య ఇంటికి వెళ్లి అతడి భార్య రజితను కలిసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ.. గల్ఫ్ దేశాల్లో ఉపాధి కల్పిస్తామని ఏజెంట్లు మోసం చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం లింగయ్య వద్ద వైద్య చేయించుకోవడానికి చిల్లి గవ్వ లేదన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి ఎన్నారై అడ్వైజరీ కమిటీ చైర్మన్ వినోద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారన్నారు. సామాజిక సేవకులు సత్యం పటేల్, బాలరాజ్ గౌడ్, తిరుపతి రెడ్డి ఆదివారం లింగయ్యతో పాటు కంపెనీ యాజమాన్యాన్ని కలిసినట్లు తెలిపారు. తప్పకుండా లింగయ్యను తిరిగి స్వదేశానికి రప్పించి ఆయనకు ఉపాధి కల్పించేలా మంత్రి దృష్టికి తీసుకెళ్తామని సంపత్ కుమార్ తెలిపారు.

కరెంట్ ఫెన్సింగ్ తీగే మృత్యుపాశమై..

- విద్యుదాఘాతంతో కౌలు రైతు దుర్మరణం
- వర్గల్ మండలం మజీద్‌పల్లిలో ఘటన


నీల స్వామి (ఫైల్)

వర్గల్(గజ్వేల్): పందుల బెడద నుంచి పైరును కాపాడేందుకు ఏర్పాటు చేసిన కరెంట్ ఫెన్సింగ్ తీగే ఆ రైతు పాలిట మృత్యుపాశమైంది. విద్యుదాఘాతంతో పైరుకు నీరు పారిస్తున్న కౌలు రైతు మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన సోమవారం సాయంత్రం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం మజీద్‌పల్లిలో చోటు చేసుకుంది. బేగంపేట ఎస్ఐ మహిపాల్‌రెడ్డి, గ్రామస్తుల కథనం ప్రకారం.. వర్గల్ మండలం దండుపల్లికి చెందిన నీల స్వామి(40) మజీద్‌పల్లిలో కొంత పొలం కౌలుకు తీసుకొని మొక్కజొన్న సాగు చేశాడు. పందుల బెడద నుంచి పంట కాపాడుకునేందుకు చుట్టూరా కరెంట్ ఫెన్సింగ్ తీగ ఏర్పాటు చేశాడు. సోమవారం ఉదయం పొలంలో నీరు పారించేందుకు వెళ్తున్నట్లు భార్య శ్యామలకు చెప్పి వెళ్లాడు. మధ్యాహ్నం భోజనానికి రాలేదు. కుమారుడు రాజు పలుమార్లు తండ్రికి ఫోన్ చేసినప్పటికీ స్పందించలేదు. దీంతో పొలం వద్దకు వెళ్లి వెతికాడు. అక్కడ ప్రమాదవశాత్తు కరెంట్ ఫెన్సింగ్ తీగను తగిలి విద్యుత్ షాక్‌కు గురై పొలంలోనే చనిపోయి కనిపించాడు. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించామని ఎస్ఐ పేర్కొన్నారు.

మొక్కజొన్న సాగుపై ఆరా

హరిదాసుపూర్‌లో సౌదీ అరేబియా రైతులు


రైతులతో మాట్లాడుతున్న సౌదీ అరేబియా రైతులు

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని హరిదాసుపూర్‌లో సోమవారం సౌదీ అరేబియా రైతులు పర్యటించారు. గ్రామంలోని రైతులను కలిసి జొన్న పంట సాగు పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఒక ఎకరాల్లో జొన్న సాగుచేయడానికి ఎంత పెట్టుబడి అవుతుంది? దిగుబడి ఎంత వస్తుంది? మార్కెట్ జొన్న పంటకు డిమాండ్ ఎలా ఉందనే విషయాలపై ఆరా తీశారు. జొన్న సాగు చేయడానికి ఒక ఎకరాకు రూ. 20 వేల పెట్టుబడి వస్తుందని, ఒక ఎకరాలో 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతులు వివరించారు. అనంతరం జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ మాట్లాడుతూ.. నీటి సాంద్రత తక్కువ ఉన్న ప్రాంతంలో ఎలాంటి పంటలను సాగు చేయాలనే పరిశోధనతో క్షేత్రస్థాయిలో సాగు వివరాలను తెలుసుకునేందుకు సౌదీ అరేబియా రైతులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు, ఏడీఏ వెంకటలక్ష్మీ, మండల వ్యవసాయాధికారి గణేశ్, ప్రతిభ, ఏఈఓ రవి రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎగిసి పడుతున్న 'భగీరథ' నీరు



అక్కన్నపేట(హుస్నాబాద్): భగీరథ గేట్‌వాల్స్ లీకేజీ కారణంగా నీరు ఎగిసిపడింది. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండల కేంద్రం నుంచి గొలపెల్లిలో సోమవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. కన్నారం నుంచి కట్కూర్ గ్రామానికి వచ్చే దారిలో మిషన్ భగీరథ గేట్‌వాల్స్ లీకేజీ కారణంగా వందలాది లీటర్ల నీరు వృథా రోడ్డుపాలైంది. అసలే వేసవికాలం వల్ల ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతుంటే.. ఇలా నీటిని వృథా కావడంపై స్థానికులు మండిపడుతున్నారు.



చోరీల నిందితుడు అరెస్ట్

– 3.5 తులాల బంగారం, వెండి స్వాధీనం

పటాన్‌చెరు టౌన్: ఇళ్లల్లో చోరీలకి పాల్పడుతున్న దొంగను పోలీసులు అరెస్టు చేశారు. క్రైమ్ సీఐ రాజు కథనం మేరకు.. చందానగర్ పాపిరెడ్డి కాలనీకి చెందిన శివరాత్రి దివాకర్ (23) పటాన్ చెరు డివిజన్ పరిధిలోని గౌతమ్ నగర్ కాలనీలో సోమవారం అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. పోలీసులు దివాకర్‌ను అదుపులోకి తీసుకొని విచారించి దొంగతనాలకు పాల్పడే పాత నేరస్తుడిగా గుర్తించారు. ఇటీవల పటాన్‌చెరు పరిధిలో చోరీ చేసిన 3.5 తులాల బంగారం,15 తులాల వెండి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు గతంలో సిద్దిపేట, గుమ్మడిదల, రామచంద్రాపురం, చందానగర్, దుండిగల్, బొల్లారం పలు ప్రాంతాల్లో దొంగతనం చేసి 20 కేసుల్లో జైలు శిక్ష అనుభవించి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. నెల రోజుల్లో పటాన్ చెరు పరిధిలో రెండు దొంగతనాలు చేసి తప్పించుకొని తిరుగుతున్నాడని తెలిపారు. పట్టుబడిన దివాకర్ ను రిమాండ్‌కి తరలించినట్లు తెలిపారు.

ఇంజన్‌లో షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం


మంటల్లో దగ్ధమవుతున్న కారు

కేతేపల్లి: ఇంజన్‌లో షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధమైంది. ఈ ఘటన విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్లపహాడ్ వద్ద సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరువు మండలం ఇస్నాపూర్‌లో నివాసముంటున్న వీ. వెంకట్రావు రంగారెడ్డి జిల్లా చేవెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నాడు. వెంకట్రావు సోమవారం భార్యతో కలిసి కారులో హైదరాబాద్ నుంచి విజయవాడకు బయల్దేరాడు. మార్గమధ్యలో కేతేపల్లి మండలం కొర్లపహాడ్ వద్దకు రాగానే కారు ఏసీలో నుంచి పొగలు వచ్చాయి. గమనించిన వెంకట్రావు దంపతులు కారును రోడ్డు పక్కకు నిలిపి కిందకు దిగారు. వెంటనే ఇంజన్‌లో మంటలు చెలరేగి నిమిషాల వ్యవధిలోనే కారుకు మొత్తం అంటుకున్నాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా.. నకిరేకల్ ఫైర్ స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలార్పివేశారు. అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. బాధితుడు వెంకట్రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొనిల దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివతేజ తెలిపారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు!

విశ్వనాథస్వామి ఆలయ ఆవరణలో భారీ గొయ్యి

- చైర్మన్‌పై భక్తుల ఆగ్రహం
- ఎమ్మెల్యే, పోలీసుల పరిశీలన
- పోలీసుల అదుపులో చైర్మన్


గొయ్యిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణంలోని విశిష్ట చరిత్రగల ప్రాచీన కాశీ విశ్వనాథస్వామి ఆలయం ఆవరణలో గొయ్యి తవ్వకం కలకలం సృష్టించింది. గుప్త నిధుల కోసమేనని భక్తులు అనుమానం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కాశీ విశ్వనాథస్వామి ఆలయ ముఖద్వారం ఎదుట ఉన్న మండపానికి ఆనుకొని దాదాపు ఐదు అడుగుల లోతు, 10 అడుగుల వెడల్పుతో గొయ్యిని తవ్వారు. దానిపై పాత గేటు గ్రిల్ వేసి, గొయ్యి కనిపించకుండా ఉండేందుకు గడ్డి, చెట్ల పొదలతో కప్పి ఉన్న విషయాన్ని సోమవారం ఆలయానికి వచ్చిన భక్తులు గుర్తించారు. ఆలయ కమిటీ చైర్మన్ హన్మాండ్లును పిలిపించగా పూజకు వాడిన పూలను వేసేందుకు ఆదివారం తానే అడ్డా కూలీలతో తవ్వించినట్లు తెలపారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలో ఉన్న ఆలయంలో అధికారుల అనుమతి లేకుండా, కమిటీలోని ఇతర బాధ్యులకు తెలపకుండా ఎలా తవ్వించారని భక్తులు ప్రశ్నించారు. పూలను వేసేందుకైతే అంత పెద్ద గొయ్యి, అదీ మండపానికి ఆనుకొని దాని పునాదులు కూలే అవకాశం ఉండేలా తవ్వించడం.. పైగా కనపడకుండా పైన గ్రిల్‌పెట్టి పొదలతో కప్పిఉంచడంలో ఆంతర్యం ఏంటని భక్తులు నిలదీశారు. ఇద్దరు కూలీలతో తవ్వించినట్లు చెబుతుండగా నలుగురితోపాటు ఓ బాబా సైతం ఉన్నట్లు అక్కడున్న వారు చెప్పడంతో గుప్త నిధుల కోసమే తవ్వించారని భక్తులు ఆరోపించారు. విషయం తెలుసుకొని ఎస్సై–2 మొగులయ్య సిబ్బందితో వచ్చి వివరాలు సేకరించారు. విచారణ నిమిత్తం చైర్మన్ హన్మాండ్లును స్టేషన్‌కు తరలించారు.

గొయ్యిని పరిశీలించిన ఎమ్మెల్యే

విషయం తెలుసుకొని ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, నాయకులు అశోక్‌రెడ్డి గొయ్యిని పరిశీలించారు. ఆలయం ఆవరణలో అపారమైన నిధి ఉందని చైర్మన్ హన్మాండ్లు చెప్పేవారని కొందరు ఎమ్మెల్యేకు వివరించారు. కొత్త ఆలయ కమిటీ ఏర్పాటుకు నోటిఫికేషన్ రానున్న తరుణంలో ఘటన జరగడం, పరిస్థితులను బట్టి గుప్తనిధుల కోసమే తవ్వినట్లు ఎమ్మెల్యే అనుమానం వ్యక్తం చేశారు. త్వరగా కొత్త కమిటీ కోసం నోటిఫికేషన్ ఇవ్వాలని దేవాదాయ, ధర్మాదాయశాఖ ఉన్నతాధికారులను ఫోన్ ద్వారా కోరారు. తవ్వకాల విషయంలో కేసు నమోదు చేసి సమగ్రవిచారణ జరిపి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఎమ్మెల్యే సూచించారు.